క్లుప్తంగా

క్రిస్మస్ శుభాకాంక్షలు



ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : కమలాపురం నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గంలోని క్రైస్తవ సోదర సోదరీమణులు క్రిస్మస్ పండుగను కుటుంబ సభ్యులు, సన్నిహితులు, బంధువులతో కలసి సంతోషంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే కమలాపురం ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జున రెడ్డి నియోజకవర్గ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట-బుగ్గలేటిపల్లి సమీపంలో వెలసిన గంగమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ చైర్మన్ విశ్వనాథరెడ్డి, పి.సురేష్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

గండి అంజన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే



అంజన్నను కుటుంబ సభ్యులతో దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామిని ఆదివారం కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథరెడ్డి కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. అలాగే పంచాయతీరాజ్ శాఖ ఈఎన్‌సీ బాలూ నాయక్‌లు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారి ముకుందరెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు వారికి ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

వెలిదండ్లలో వికసిత భారత్ సంకల్ప యాత్ర



లబ్ధిదారులకు ఉచిత గ్యాస్‌సిలిండర్, స్టౌను అందిస్తున్న ఎంపీపీ రమాదేవి

లింగాల : మండలం వెలిదండ్ల గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని ఎంపీపీ రమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వివిధ పథకాల ద్వారా అందుతున్న లబ్ధిని, చౌకధర దుకాణం ద్వారా నిత్యావసర సరుకులు వంటి వాటిని వివరించారు. అదేవిధంగా పంటలపై పురుగు మందుల పిచికారి డ్రోన్‌ను ప్రదర్శించారు. డ్రోన్లను కేంద్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ద్వారా అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, మండలస్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వేలాది మందికి అభివాదం చేస్తూ..

సింహాద్రిపురంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన

సింహాద్రిపురం : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో మూడు రోజుల పర్యటనలో భాగంగా రెండవ రోజు ఆదివారం మధ్యాహ్నం సింహాద్రిపురంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని, పోలీస్‌స్టేషన్‌ను, ఎంపీడీఓ కార్యాలయాన్ని, నూతనంగా సుందరీకరించిన రోడ్లు, జంక్షన్లను, వైఎస్సార్ పార్కును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఇందులో ఎంట్రీలో ప్లాజా వాటర్ ఫౌంటేన్, చిన్నపిల్లల ప్లే ఏరియా, ఓపెన్ జిమ్, వైఎస్సార్ విగ్రహాంలను అందంగా ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో రోడ్డు వెడల్పు సుందరీకరణ పనులు ప్రారంభించిన అనంతరం కాలినడకన నడుస్తూ ప్రజలకు అభివాదం చేస్తూ వేలాది మంది జనం కేరింతల నడుమ సింహాద్రిపురం హెలీప్యాడ్ నుంచి ఇడుపులపాయకు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో పాడా ఓఎస్డీ అనిల్ కుమార్‌రెడ్డి, ఆర్డీఓ వెంకటేశులు, తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఎంపీడీఓ కృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ ఝాన్సీరాణి, ఎంపీపీ అరుణ, ఉద్యాన శాఖ రాష్ట్ర మెంబర్ ప్రసాద్‌రెడ్డి, నెడ్‌క్యాప్ డైరెక్టర్ కిశోర్‌రెడ్డి, సింగిల్ విండో ప్రెసిడెంట్ శేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ జాఫర్, సర్పంచ్ రామ్మోహన్, వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సింహాద్రిపురంలో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



వాహనంలో నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం



సీఎం జగనన్నకు అభివాదం చేస్తున్న మహిళలు



సీఎం జగనన్నకు చిన్నారుల పలకరింపు..



సీఎం జగన్‌ను ఆశీర్వదిస్తున్న వృద్ధ మహిళ



ఎంపీడీవో ఆఫీస్‌లో చిత్రాలను పరిశీలిస్తున్న సీఎం

నేడు విగ్రహ ప్రతిష్ట వేడుకలు

లింగాల : మండల పరిధిలోని లోపట్నూతల గ్రామ సమీపంలో నిర్మించిన ఆలయాలలో శ్రీ పాండురంగస్వామి, శ్రీకాశిరెడ్డి నాయన విగ్ర హ ప్రతిష్ట వేడుకలు నిర్వహిస్తున్నామని కార్యనిర్వాహకులు అలవలపాటి నాగభూషణంరెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు వేద పండితులచే గణపతిపూజ, గోపూజ, నవగ్రహ పూజ, హోమాది కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. దేవతామూర్తులకు ప్రాణ ప్రతిష్ట గావించి విగ్రహాలను ప్రతిష్టింపజేస్తారన్నారు. భక్తులు విరివిగా పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

ప్రార్థన





ఇడుపులపాయలో ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న వైఎస్ విజయమ్మ, వైఎస్ భారతీరెడ్డి



దైవ సందేశం ఇస్తున్న పాస్టర్

ఘనంగా జాతీయ వినియోగదారుల దినోత్సవం

వేంపల్లె : స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షుడు ప్రిన్సిపాల్ యోగాంజనేయులు హాజరై మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు, బాధ్యతల గురించి తెలియజేశారు. అలాగే వాణిజ్య విభాగంలో పనిచేస్తున్న శ్రీనివాసులు, మల్లేశ్వరమ్మలు వినియోగదారులకు సమస్యలు ఎదురైనప్పుడు పరిష్కారమయ్యే చట్టాల గురించి విద్యార్థులకు తెలియజేశారు. అలాగే ప్రొజెక్టర్ ద్వారా వినియోగదారుల హక్కులు, బాధ్యతలు, బాధ్యతలతో పాటు వినియోగదారులకు ఎదురైన సమస్యలను ఉదాహరణలతో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



వినియోగదారుల చట్టాల గురించి తెలియజేస్తున్న వాణిజ్య విభాగపు అధికారిణి మల్లేశ్వరమ్మ

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



శాస్త్రీయ నృత్యంలో చిన్నారులు



నృత్య భంగిమలో అలరిస్తున్న చిన్నారులు

పులివెందుల టౌన్ : స్థానిక శిల్పారామంలో క్రిస్మస్ పండుగలో భాగంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. మదనపల్లెకు చెందిన శ్రీసూర్య డ్యాన్స్ అకాడమికి చెందిన శిష్య బృందం నిర్వహించిన జానపద, వెస్టన్ నృత్యప్రదర్శనలు అందరిని అలరించాయి. తదితర పాటలకు వేసిన స్టెప్పులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డ్యాన్స్ మాస్టర్ సూర్యకుమార్, శిల్పారామ ఏఓ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

మానవ సేవే మాధవ సేవగా గుర్తించాలి

వేంపల్లె : ప్రతి ఒక్కరూ మానవ సేవే మాధవ సేవగా గుర్తించాలని ఆల్ ఆమీన్ సొసైటీ వ్యవస్థాపకులు, మాజీ జెడ్పీటీసీ, ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎస్.ఎఫ్.బాషా తెలిపారు. ఆదివారం స్థానిక బాషా ఆసుపత్రిలో సూపర్ స్పెషలిస్ట్ డాక్టర్‌చే ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలతోపాటు పట్టణ ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. కొన్ని దశాబ్దాలుగా తమ ఆల్ ఆమీన్ సొసైటీ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రజల సహకారం కూడా ఎంతో ఉందన్నారు. అంతేకాక ప్రతి ఒక్కరూ వైద్యం, ఆరోగ్యంపట్ల శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని, ఆరోగ్యమే మహా భాగ్యంగా భావించాలన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు బాబా షరీఫ్, స్పెషలిస్ట్ డాక్టర్లు, విద్యా వలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ కృష్ణ కార్తీక్‌రెడ్డి, తదితరులు

ఎన్ని సర్వేలు చేసినా జగనన్న విజయాన్ని ఆపలేరు

పులివెందుల రూరల్ : టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌లు పీకే లాంటి వారితోకాక ఎంత మందితో సర్వే చేయించినా ఏపీలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయాన్ని ఎవరూ ఆపలేరని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రసూల్, జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళిలు తెలిపారు. ఆదివారం స్థానిక దూదేకుల సంఘ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల నాడిని ముందే గమనించి ఇచ్చిన పథకాల కంటే ప్రజలకు అవసరమైన పథకాలను అమలు చేస్తున్న ఏకై క సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు కలిసి పోటీ చేసినా, విడివిడిగా పోటీ చేసినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఎన్నికలలో జనసేన పార్టీకి డిపాజిట్లు కూడా రాలేదన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఆయన పథకాల ద్వారానే 2024 ఎన్నికల్లో మళ్లీ విజయం సాధిస్తారన్నారు.

మానవత సేవలు అందించేందుకు కృషి

వేంపల్లె : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ప్రజలకు వివిధ సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఆ సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి, అధ్యక్షుడు బాలాజీలు తెలిపారు. ఆదివారం స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో ప్రముఖ డాక్టర్ మోహన్ డయాబిటీస్ సెంటర్ ద్వారా వివిధ రకాల మధుమేహ వ్యాధికి సంబంధించిన వైద్య పరీక్షలను ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవత సంస్థ ద్వారా ఎంతోమంది అభాగ్యులకు, అనాథలకు, వృద్ధులకు, వికలాంగులు, నిరాశ్రయులకు సేవలు అందించడం జరుగుతోందన్నారు. అంతేకాక కార్పొరేట్ ఆసుపత్రుల ద్వారా పేద, సామాన్య ప్రలకు వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అందుకు సహాయ సహకారాలు అందించిన వారికి మానవత స్వచ్ఛంద సంస్థ తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే మానవత సంస్థ చైర్మన్ బి.చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో వారికి మెమెంటో ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్పెషలిస్ట్ సెంటర్ మేనేజర్ సుధీర్, వైద్య సిబ్బంది, మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు, ఉపాధ్యాయులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మహా సభలను విజయవంతం చేయండి

వేంపల్లె : జిల్లాలోని ప్రొద్దుటూరులో జనవరి 7, 8వ తేదీలలో జరిగే మహా సభలను జయప్రదం చేయాలని వేంపల్లె భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి బాలాజీలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద మహా సభలకు సంబంధించిన కరపత్రాలను వారు విడుదల చేశారు. కార్మికుల ఐక్యత, సమస్యలు, వాటి పరిష్కారం తదితర అంశాలపై మహాసభలు జరగనున్నట్లు వారు తెలిపారు. భవన నిర్మాణ కార్మిక సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా జగనన్న పాలన

ఎర్రగుంట్ల : ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని 15వ వార్డు మహాత్మనగర్ కాలనీలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, 15వ వార్డు ఇన్‌చార్జి రాజవర్ధన్‌రెడ్డిలతో కలసి గడప గడపకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వాటిని అక్కడున్న అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కేవలం జన్మభూమి కమిటీలు ఎంపిక చేసిన వారికి మాత్రమే పథకాలు వర్తించేవన్నారు. తమ ప్రభుత్వంలో కులమత, రాజకీయ విభేదాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ కేవలం గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే పథకాలు వర్తించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి ఎలాంటి సమస్య వచ్చినా తాను తప్పక తీరుస్తానని ప్రజలకు ఆయన భరోసా ఇచ్చారు. సుందరయ్య కాలనీలో ఇంటింటికి వెళ్లి వారికి పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఏవరైతే పథకాలు అందలేదని చెబుతున్నారో వెంటనే అక్కడే ఉన్న అధికారులతో మాట్లాడి ఎందుకు అందడం లేదో ఆరా తీసి వారికి పథకాలు అందించేలా చూడాలని ఆదేశించారు. అనంతరం దివ్యాంగులకు ట్రైసైకిల్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు డి.సూర్యనారాయణరెడ్డి, రామలింగారెడ్డి, సతీష్ రెడ్డి, కేవీ సుబ్బారెడ్డి, రాజారెడ్డి, వలంటీర్లు కార్యకర్తలు పాల్గొన్నారు.



వికలాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

అంగన్‌వాడీల నిరసన

కమలాపురం : తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు క్యాండిల్స్ చేతబట్టి నిరసన చేపట్టారు. ఈనెల 12వ తేదీ నుంచి అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెలో భాగంగా ఆదివారం సాయంత్రం స్థానిక క్రాస్ రోడ్డు వద్ద ఏఐటీయూసీ, సీఐటీయూల ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు క్యాండిల్స్ చేతబట్టి నిరసన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు తమకు రూ.26వేల వేతనం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

చర్చిలకు క్రిస్మస్ శోభ

కమలాపురం : మండలంలోని వివిధ గ్రామాల్లో వెలసిన చర్చిలు క్రిస్మస్ శోభను సంతరించుకున్నాయి. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ఆదివారం రాత్రి పట్టణంలోని నిస్సీ, సీఎస్ఐ, ఆర్‌సీఎం, టీసీసీ, రహెబోతు, మన్నా, హోసన్నా, షిలోహు, యోరూషలేము చర్చిలతో పాటు రామచంద్రాపురం, పెద్దచెప్పలి, చిన్నచెప్పలి, గంగవరం, చదిపిరాళ్ల, పందిళ్లపల్లె, ఎర్రగుడిపాడు తదితర గ్రామాలలోని చర్చిలను రంగు రంగుల విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. దీంతో చర్చిలన్ని కొత్త శోభను సంతరించుకున్నాయి. ఎస్సీ కాలనీల్లో విద్యుద్దీపాల పందిర్లు ఏర్పాటు చేయడంతో ఆ కాలనీల్లో పండుగ వాతావరణం నెలకొంది. అలాగే చర్చిల్లో రాత్రంతా ప్రత్యేక ఆరాధన ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులు ఇంటింటికి వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవులు రాత్రి క్యాండిల్స్ చేతబట్టి పుర వీధుల గుండా క్యారల్స్ నిర్వహించి ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కేక్ కట్ చేసి పంచి పెట్టారు. కాగా ఆర్‌సీఎం చర్చిలో బాల యేసు ఉన్న పూరిపాక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



కమలాపురంలో విద్యుద్దీపాల అలంకరణలో ఆర్‌సీఎం చర్చి

నేడు ప్రత్యేక ప్రార్థనలు :

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం అన్ని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. ఫాస్టర్లు క్రిస్మస్ పండుగ ప్రత్యేకతను, ఏసు క్రీస్తు పుట్టుకను, జీవితాన్ని భక్తులకు వివరిస్తారు. ఇప్పటికే చర్చిల్లో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : పట్టణంలోని టౌన్‌చర్చి క్రిస్మస్ వేడుకలకు ముస్తాభయింది. పట్టణంలో అతిపురాతనమైన చర్చిగా పేరున్న టౌన్ చర్చిలో ఏసుప్రభువు జన్మదినం పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలకు రెవరెండ్ ఫాస్టర్లు సిద్ధమవుతున్నారు. చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించారు. బ్రిటిషు కాలం నుంచి ఈ చర్చిలో క్రిస్మస్‌ను పట్టణ వాసులందరు కలిసి ఘనంగా జరుపుకుంటారు. ఆదేవిధంగా ప్రొద్దుటూరు రహదారిలోని ఆర్‌సీఎం, నెహ్రూనగర్‌లోని సీఎస్ఐ చర్చిలో ప్రత్యేకంగా అలంకరించారు.



కమలాపురం చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన బాలయేసు పూరిపాక

ముద్దనూరులో..

ముద్దనూరు : క్రైస్తవులకు అత్యంత ప్రీతికరమైన పర్వదినం క్రిస్మస్. ఈ పర్వదిన వేడుకలకు ప్రార్థనా మందిరాలైన చర్చిలు ముస్తాబయ్యాయి. సోమవారం క్రిస్మస్ పర్వదినం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో చర్చిలను ప్రత్యేకంగా అలంకరించారు. చర్చిలు విద్యుదీపాలతో కళకళలాడుతున్నాయి.

చెన్నూరులో...

చెన్నూరు : స్థానిక ఆర్‌సీఎం చర్చిలో ఆదివారం నేడు క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేక ప్రత్యేక ప్రార్థనలు గావించారు. ఫాదర్ పీటర్ ప్రభాకర్ క్రిస్మస్ సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా చర్చిని విద్యుద్దీపాలతో అలంకరించారు.



జమ్మలమడుగులో విద్యుత్ దీపాలతో అలంకరించిన టౌన్‌చర్చి



ముద్దనూరులో విద్యుదీపాలంకరణలో ఎస్సీఓ చర్చి



చెన్నూరులో విద్యుద్దీప వెలుగుల్లో చర్చి